# సింగిల్ పేజీ కథలు

## సేవాఫలం

సత్యం మనసంతా ఆనందంగా ఉంది. ఇంకో నాలుగురోజుల్లో అతను ఓ ఫ్లాటుకు సొంతదారుడు కాబోతున్నాడు.

నిజానికి అతను సొంతంగా ఓ ఇల్లు కట్టుకోవాలని ఎన్నాళ్ళనుంచో కలలు కంటున్నాడు. ముందుగా ఫ్లాటుకోసం డబ్బు దాస్తూ వచ్చాడు. అది ఈనాటికి ఎనభై వేలయింది. డబ్బు మొత్తం చెల్లించే పక్షంలో గురువారం ఫ్లాటు రిజిస్టరు చేయించి ఇస్తానని ఫ్లాటు ఓనర్ అన్నాడు. కనుక ఫ్లాటు ధర తోపాటు రిజిస్ట్రేషన్ ఖర్చులకు కూడా తాను దాచుకొన్నది సరిపోతుంది. ఇంకో రెండేళ్ళు కాస్త డబ్బులు దాచుకొని, తర్వాత బ్యాంకులోను తీసుకొని ఇల్లు కట్టడం ప్రారంభించాలి.



ఇల్లు తాళం వేసి ఉండటం చూసి ప్రక్కింట్లో అడిగాడు.

''మీ నాన్నగారికి ఆయాసం ఎక్కువైతే వాసంతి హాస్పిటల్‌కి తీసుకెళ్ళిందండీ. ఆయన్ను అడ్మిట్ చేసుకొన్నారనీ, మీరు రాగానే పంపమని ఇందాకే ఫోన్ చేసి చెప్పింది'' ప్రక్కింటావిడ తాళంచెవులిస్తూ చెప్పింది.

''ఏ హాస్పిటల్?''

ఆమె చెప్పింది. వెంటనే హాస్పిటల్ చేరుకొన్నాడు. బయటే ఉన్న వాసంతిని అడిగాడు.

''నాన్నగారికెలా వుంది? డాక్టరుగారేమన్నారు?''

''ఇంకా అలాగే వుంది. ఆయాసం వల్ల ఊపిరి తీయడం కష్టమౌతున్నది. ఐ.సి.యులో ఉన్నారు. ముందు పదివేలు కట్టమంటున్నారు. మీకోసం ఆఫీసుకు ఫోన్ చేస్తే బయటకు వెళ్ళారని చెప్పారు.''

''అవును. ఫ్లాటు విషయం గురించి సుబ్బారావుగారింటికి వెళ్ళాను.''

''ఏమన్నారు?'' ఆతృతగా అడిగింది.

''తర్వాత చెప్తాలే. ముందు బ్యాంకులో డబ్బు డ్రా చేయాలి. నాన్నగారిని చూస్తూ ఉండు.''

వాచీ చూసుకుంటూ బయటకు నడిచాడు సత్యం.

★ ★ ★

ఈజీ చైర్‌లో కళ్ళు మూసుకొని పడుకొని ఉన్న సత్యాన్ని చూస్తున్న వాసంతి మనసు జాలితో నిండిపోయింది. ఫ్లాటు కొనాలని ఎన్నో ప్రయత్నాలు చేసి ఎక్కడెక్కడో తిరిగి తీరా అతని కల నిజమయ్యే సమయానికి తండ్రి అనారోగ్యంతో హాస్పిటల్ పాలవడం, డెబ్బైవేలు మంచినీళ్ళలా ఖర్చయిపోవడం ఒక దెబ్బైతే, అతని తండ్రి కూడా దక్కకపోవడం ఇంకా పెద్ద దెబ్బైంది. డబ్బు గురించి బాధపడకుండా, తండ్రి ఆరోగ్యం గురించే తపించిన అతని వ్యక్తిత్వానికి, మంచితనానికి మనసులోనే అభినందించింది వాసంతి.

ఇంతలో ''నాయనా సత్యం'' అంటూ వచ్చిన శాస్త్రిగారిని ఇద్దరూ లోపలికి ఆహ్వానించారు. ఆయన సత్యం తండ్రికి స్నేహితుడు. ఇద్దరూ ఒకే డిపార్ట్‌మెంట్‌లో కలిసి పనిచేసి రిటైరైనవారు.

''సత్యం నీతో ఒక ముఖ్యమైన విషయం మాట్లాడాలయ్యా. ఇరవై ఏళ్ళ క్రిందట మేమంతా ఫ్లాట్లు వేసుకోవడానికి స్థలం కొనడం, దానికి కొన్ని అడ్డంకులు వచ్చి లే అవుట్ అప్రూవ్ కాకపోవడం, కోర్టులో కేసు జరగడం నీకు తెలిసిన విషయమే. దానిపై మేమంతా ఆశ కూడా వదులుకున్నాము. కాని ఇప్పుడు అది అప్రూవ్ అయి గవర్నమెంటు పర్మిషన్ కూడా వచ్చేసింది. ఇంకో నెలరోజుల్లో ఫ్లాట్లు వేయడం, మెంబర్లందరికీ కేటాయించడం జరుగుతుంది. మీనాన్న ఆనాడే మూడు వేలు కట్టేశాడు కనుక ఆయనపేర కూడా ఒక ఫ్లాటు ఉంటుంది. ఆయన ఏకైక వారసుడిగా అది నీకు వస్తుంది. నీవు రిజిస్ట్రేషన్ ఖర్చులు మాత్రం పెట్టుకొంటే చాలు. ఇప్పుడు అక్కడ ఫ్లాటు విలువ రెండు లక్షలుంటుంది తెలుసా?''

చెప్పడం ఆపి సత్యం వంక చూశారాయన. సత్యం ఆనందంతో మాట రాక ఆనందబాష్పాలతో తండ్రి ఫోటో వంకే చూస్తున్నాడు కృతజ్ఞతాభావంతో.

శాస్త్రిగారు అతని భుజం తడుతూ ''నిస్వార్థంగా తల్లిదండ్రులకు చేసిన సేవలు, త్యాగాలను భగవంతుడు తప్పక గుర్తిస్తాడయ్యా'' అన్నారు తానూ మిత్రుడిని తలచుకొంటూ.

**-సి.ఎన్.చంద్రశేఖర్ (చిత్తూరు)**

## ఫైనాన్స్ కంపెనీ

అనేక ఉద్యోగాలకి దరఖాస్తులు పంపి పంపి విసిగిపోయిన బాలుకి ఓ కొత్త ఉద్యోగ ప్రకటన ఊపిరిపోసింది. టెక్నికల్, కంప్యూటర్ చదువులకే అవకాశాలు వున్న ఈ రోజుల్లో బి.కాం గ్రాడ్యుయేషన్ చేసి అటు బిఇడీకి, ఇటు అకౌంట్స్‌కి పోలేక గుమాస్తా ఉద్యోగాన్ని వెదుకుతున్న నిరుద్యోగి బాలు.

ప్రకటన వివరాలను పేపర్లో చూసాడు బాలు. అదొక ఫైనాన్స్‌కంపెనీ. ఖాళీగా ఉన్న ఉద్యోగం ఒకటే. క్లర్క్ కమ్ టైపిస్టు. నెలకు జీతం రూ.800/- ఒక సంవత్సరం తరువాత రెగ్యులర్ చేస్తారు. అప్పుడు జీతం పెరుగుతుంది. తన క్వాలిఫికేషన్‌కు సరిపడిన ఉద్యోగం. పైగా ఊర్లోనే. ఈ ఉద్యోగం ఎలాగైనా సంపాదించాలి. నిర్ణయించుకున్నాడు బాలు. ప్రకటన క్రిందగా మరొక గమనిక. ఫైనాన్స్ కంపెనీ కనుక పదివేలు సెక్యూరిటీ డిపాజిట్ కట్టాలి. గమనిక చూసిన బాలుకి ఒక్కసారిగా నీరసం వచ్చేసింది. మళ్ళీ ఆలోచనలో పడ్డాడు. ముందుగా దరఖాస్తు చేసి తరువాత ఒక నిర్ణయానికి రావాలని నిశ్చయించుకొన్నాడు.

తండ్రి వారసత్వంగా ఇచ్చిన ఇంటిని పదివేలకు